క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు సాయం



పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామంలో గోరంతల భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన బాధిత కుటుంబానికి బియ్యం, నూనె అందజేశారు. ఈ కార్యక్రమంలో బిర్రు సోమేశ్వర్, ముస్కు సోమేశ్వర్, ఏదునూరి మదార్, ముస్కు కేశవరావు, అనుముల మహేందర్, అనంతుల పురుషోత్తం, తొడుసు మల్లేశ్, జక్కుల రాజు, బిర్రు వెంకటేశ్వర్లు, యారా రాజు ఉన్నారు.

పాలకుర్తిలో..

మండల కేంద్రంలో బాస్కుల ఎల్లమ్మ తల్లి గాదెపాక కనకమ్మ ఆదివారం మృతి చెందింది. కాగా, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డిల జనహిత కార్యక్రమాల స్ఫూర్తితో బాధిత కుటుంబాలకు నాయకులు ఆర్థికసాయం అందజేశారు. సోం మల్లయ్య, ఎల్లమ్మ, యాకసోమయ్య, రాంచంద్రు, సునీల్, వెంకన్న ఉన్నారు.

చిన్నరామన్‌చర్లలో..

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు రామగళ్ల సంతోష్ మృతి చెందాడు. కాగా, పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పరామర్శ



నర్మెట: మంలకేంద్రానికి చెందిన కొత్త బుచ్చయ్య (డప్పు బుచ్చయ్య) (65), ప్రెజ్ఞాపురం ఉప్పలయ్య (55) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. కాగా డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులతో కలసి సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. నాయకులు వలబోజు శ్రీనివాస్, దేవులపల్లి భాగ్యలక్ష్మి, ప్రెజ్ఞాపురం శ్రీధర్, ముక్కెర రాజేష్, పల్లె ప్రభుదాస్, పులి రేణుక తదితరులు ఉన్నారు.

కడగుట్టతండాలో..

కొడకండ్ల: కడగుట్టతండాకు చెందిన మాజీ వార్డుసభ్యుడు ధరావత్ శ్రీనునాయక్ తండ్రి జగ్నా అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము తదితరులు జగ్నా మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటేశ్వర్‌రావు, వెంకటనారాయణ, రమాదేవి ఉన్నారు.

కౌన్సిలర్‌కు మాతృ వియోగం



జనగామ: పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ గంగర బోయిన మల్లేశం తల్లి సాయమ్మ సోమవారం మృతి చెందింది. కాగా, కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణిమల్లారెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదపాక రామచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బంక శివరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, జక్కుల వేణుమాధవ్, తదితరులు సాయమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశంను ఓదార్చారు.

కేసు నమోదు

దేవరుప్పుల: మండల పరిధిలోని టోల్‌గేట్ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో ఆదివారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సృజన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ కుమారుడు టోల్‌గేట్ నుంచి వెళ్లే సమయంలో రుసుము వేయడంతో గొడవ జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ లీడర్ కొడుకుకే రుసుము వేస్తారా అంటూ అతనితో పాటు కారుపోతుల సందీప్, సోమయ్య, యాకన్నలు కలిసి సిబ్బంది మామిండ్ల వికాస్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సన్మానం



కొడకండ్ల: నియోజకవర్గంలోని తొర్రూరు మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన హనుమాండ్ల తిరుపతిరెడ్డిని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండలాల యూత్ అధ్యక్షులు ప్రవీణ్‌యాదవ్, హరీష్‌గౌడ్, హరికృష్ణ, యాకేష్‌యాదవ్, వెంకన్నయాదవ్, మహేష్, అభిరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకం

- 2,6,10 ఇదీ.. ఆరో తరగతిలో విద్యార్థుల సంఖ్య
- మోడల్ స్కూల్, కస్తూర్బా ప్రభావంతో తగ్గుతున్న పరిస్థితి



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో ఉన్న ఇద్దరు విద్యార్థులు

లింగాలఘణపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల ల్లో మినహా ఈ ఏడాది ఆరో తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 2, 6, 10 ఇలా మొత్తం పది ఉన్నత పాఠశాలల్లో 139 మంది విద్యార్థులే ఉన్నారు. మోడల్ స్కూల్‌లో 57, కస్తూర్బాలో 35 కాగా లింగాలఘణపురంలో 2, జీడికల్‌లో 6, నెల్లుట్ల 10, వనపర్తి 12, నవాబుపేట 14, కళ్లెం 14, కుందారం 16, చీటూరులో 22 మంది విద్యార్థులే ఉన్నారు. ఇంగ్లిష్ మీడియం ఉన్నప్పటికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిస్థితి భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంది. ప్రతి ఏడాది ఆరో తరగతిలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. మండలంలో 16 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 621 మంది, 6 యుపీఎస్‌లు ఉండగా అందులో 259, మోడల్ స్కూల్‌లో 496, కస్తూర్బాలో 288 మొత్తం 835 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలోని ఐదో తరగతి విద్యార్థులు అటు మోడల్ స్కూల్ ఎంట్రన్స్, ఇటు కస్తూర్బాల్లో చేరడంతో ఇతర ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతికి కరువుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ఇక ఉన్నత పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా కానుంది. ఈ విషయంపై ఎంఈఓ విష్ణుమూర్తిని వివరణ కోరగా మోడల్ స్కూల్ ఉన్న చోట్ల ఆరో తరగతి చేరికల్లో ప్రభావం ఉంటుందని, కాగా మండలంలోని పలు పాఠశాలల్లో తండాల్లోకి వెళ్లి ఆరో తరగతిలో చేర్పించడం జరిగిందని వివరించారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న డీఈఓ రామ్

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుటుంబ సమగ్ర సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని డీఈఓ రామ్ అన్నారు. సోమవారం మండలంలోని కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్ల శిక్షణ శిబిరంలో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్వే సమయంలో సర్కారు గైడ్ లైన్స్ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల బోధనకు ఆటంకం కలుగకుండా, మరో వైపు సర్వేను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ శిక్షణలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఎంఈఓ కళావతి, ఉన్నతపాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పాలకుర్తి: మండలంలో సమగ్ర కుటుంబ సభ్యుల సర్వేకు ఎంపికైన ఉపాధ్యాయులకు సోమవారం పాలకుర్తి జెడ్పీ పాఠశాలలో సీఆర్‌పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవీందర్, ఎంఈఓ నర్సయ్యలు పరిశీలించి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సొంతఖర్చులు భరించి, బిల్లుల కోసం పోరాటంలో భాగంగా ఆందోళనకు పిలుపునిస్తే మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లె సుందరరామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను ఎస్సై సృజన్ కుమార్ అరెస్ట్ చేయగా, బీఆర్‌ఎస్ నాయకులు వారిని విడిపించారు. పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇవ్వడానికి మాజీ సర్పంచ్‌లు వెళ్లాలని నిర్ణయించుకుంటే వారు వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకతుపై విడుదల చేశామని ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో వడ్డెపల్లి మల్లారెడ్డి, కోనేటి స్వామి, నరెడ్ల బాల్‌రెడ్డి, పర్వతం మధుప్రసాద్ ఉన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ పోరుబాట పేరుతో ఆందోళనకు సిద్ధమైన మాజీ సర్పంచ్‌లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ వెళ్లకుండా తెల్లవారుజామునే మాజీ ప్రజాప్రతినిధుల భర్తలను, మాజీ ప్రజా ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసకున్నారు.



దేవరుప్పుల: పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి

కొడకండ్ల: తాజా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లుల కోసం శాంతియుతంగా ఉద్యమించే క్రమంలో ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేసేందుకు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

చెకుముకి పోటీలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: విద్యార్థులల్లో సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న చెకుముకి పోటీలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు డి.శ్రవణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. చెకుముకి పోటీలు ఈ నెల 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు షారోన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నల్లా నర్సింహులు విగ్రహావిష్కరణ

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాధయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు విగ్రహాన్ని మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఆవిష్కరించనున్నట్లు విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు మాచర్ల సారయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. తెలగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన యోదుడు నల్ల నర్సింహులు అని అన్నారు. నర్సింహులు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులతో పాటు తదితరులు హాజరవుతారని తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ కమిటీ గౌరవ అధ్యక్షురాలు చింతకింది అరుణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

రఘునాథపల్లి: పాలకుర్తి మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ సాయుద పోరాట యోధుడు అమరుడు నల్లా నర్సింహులు విగ్రహావిష్కరణకు జిల్లాలోని పద్మశాలీ, చేనేత కార్మికులు తరలిరావాలని సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పద్మశాలీకి చెందిన నర్సింహులు ఉమ్మడి రాష్ట్రంలో అనేక భూపోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలిచిన వీరుడని కొనియాడారు.



నర్సింహులు విగ్రహం

చిల్పూరుగుట్టపై స్వామివారి రూపం

చిల్పూరు: కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచిన బుగులు వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న గుట్ట పైభాగంలో తిరుమల–తిరుపతి కొండపై ఉన్న స్వామివారి రూపం ఉన్నట్లు ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు గూగుల్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీన్ని చూసిన నెటిజన్లు, భక్తులు చిల్పూరు గుట్టపై నిజంగా అద్భుతమని అంటున్నారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో ఉన్న గుట్ట పైభాగంలో ఏదో అద్భుతం ఉన్నట్లు గుర్తించిన కృష్ణమాచార్యులు గూగుల్ ద్వారా పరిశీలించగా స్వామివారి నిజస్వరూపం, దగ్గరగా చూస్తే గరుడ పక్షి, హనుమంతుడు ఉన్నట్లు, అర కిలోమీటరు కింద స్వామివారి నామాలుగా గూగుల్ ఫొటోలో కనిపిస్తోంది.





స్వామివారి రూపం (ఇన్‌సెట్‌లో) కృష్ణమాచార్యులు

'మండల అభివృద్ధికి ప్రజా పోరాటాలు'



చిల్పూరు: నూతనంగా ఏర్పడి ఏళ్లగడుస్తున్నా పాలకులు మాత్రం మండల అభివృద్ధి కోసం పాటుపడటం లేదని అందుకే సీపీఎం ఆధ్వర్యంలో ఇక నుంచి మండల సమగ్ర అభివృద్ధికి ప్రజా పోరాటాలు చేస్తుందని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట సమీపంలోని ఏచూరి నగర్ ప్రాంగణంలో సోమవారం సీపీఎం మండల 3వ మహాసభ పోలు సంపత్, సాదం శ్రీనివాస్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, యాకయ్య, మండల కార్యదర్శి సాదం రమేష్, సాదం శ్రీనివాస్, పరమేష్, గద్ద కుమార్, ప్రభాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి..

జనగామ రూరల్: పట్టణంలోని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రజా పోరాటాలు చేపట్టనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని బెత్లహేంలో నిర్వహించిన 2వ వార్డు మహాసభలో ఆయన మాట్లాడారు. బాల్నే వెంకట మల్లయ్య, పోతులూరి, కనకాచారి, ఏనుగుల కమల, ఎలీషా, పాల్, శాంతి లక్ష్మి, జానకి, మనోజ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉద్యమించాలి'



జనగామ రూరల్: సుప్రీంకోర్టు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ, మాదిగ ఉప కులాలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ విద్యార్థులు సైనికుల్లా ఉద్యమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గందమల్ల ఉదయ్ కిరణ్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్సార్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంఎస్‌ఎఫ్ నూతన కళాశాల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడారు.


మహాసభను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఈ నెల 10న మండల కేంద్రంలో జరగనున్న సీపీఎం మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కమిటీ సభ్యుడు నక్క యాకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సాగరంలో నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. శంషోద్దీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి

నర్మెట: పార్టీ సభ్యత్వ నమోదులో బీజేపీ శ్రేణులు ముందుండి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కార్యదర్శి ధరావత్ రాజు, మండల యాక్టివ్ కన్వీనర్ బుచ్చాల కొమురెల్లి అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండల కేంద్రంలో సోమవారం ఇంటింటి కార్యక్రమం చేపట్టిన వారు ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో శివ, సుధాకర్, టికటపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై శిక్షణ



స్టేషన్‌ఘన్‌పూర్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఓటరు నమోదు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్ రాజేందర్ మాట్లాడుతూ 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండనున్న వారంతా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. నూతనంగా ఓటరు నమోదు కోసం ఫారం–6 ద్వారా ఆన్‌లైన్ లోగాని, ఆఫ్‌లైన్‌లోగాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీటీ సదానందం, సీనియర్ అసిస్టెంట్ వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



రఘునాథపల్లి: పూజలు చేస్తున్న భక్తులు



బచ్చన్నపేట: బండనాగారం ఆలయంలో పూజ చేస్తున్న అర్చకుడు సాయిరామ్

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి ఆలయంలో కార్తీక మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు పిండిపోలు శ్రీనివాస్‌శర్మ అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కూరెళ్ల ఉపేందర్–రేణుక దంపతులు మాట్లాడుతూ కార్తీక మాసం నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, చింతకింది కృష్ణమూర్తి, గండె రవి, బెల్డె శ్రీనివాస్, సోమేశ్వర్, లింగయ్య, బచ్చు చిరంజీవి, హరికృష్ణ, ఆకుల జ్యోతి, కొన్నె రమ, గండె మంజుల పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: కొడవటూర్‌లోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో, బండనాగారం, కొన్నె, చిన్నరామన్‌చర్ల, బచ్చన్నపేటలోని రామలింగేశ్వరాలయంలో కార్తీక మాస ప్రారంభ సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక సత్యనారాయణ వ్రతాలను చేశారు. అలాగే సిద్ధేశ్వరాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈఓ చిందం వంశీ, ఆలయ అర్చకులు ఓం నమశివాయ, జంగిలి అంజనేయులు, ఆనంద్, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్ రెడ్డి, బండారి శ్రీనివాస్, గంగం భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తాటికొండ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి పాలాభిషేకం, జలాభిషేకం తదితర పూజలు చేపట్టారు. గౌడ కులస్తులు సామూహికంగా బిందెలతో నీళ్లతో డప్పుచప్పుళ్లతో కంఠమహేశ్వరస్వామి దేవాలయం వద్దకు సామూహికంగా తరలివెళ్లారు. అక్కడ పూజారుల వేదమంత్రాల మధ్య స్వామివారికి పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవిల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షులు దేశిని రమేష్‌గౌడ్, కమిటీ డైరెక్టర్లు పొన్నం సతీష్, ఉమ్మగోని రాజు, ఐలోని రాజు, దుబ్బాక నాగరాజు, బూరుగు ప్రసాద్, కె.మహేందర్, రాజయ్య, గౌరవ సభ్యులు ఐలోని సుధాకర్, మల్లేశం, మార్క శ్రీను, పొన్న శ్రీను, ఐలోని కిరణ్, యాకయ్య, మల్లయ్య, సభ్యులు రఘు, లింగయ్య, నాగరాజు పాల్గొన్నారు.



బిందెలతో జలం తీసుకెళ్తున్న గౌడ కులస్తులు



ఎల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న ఏసీపీ భీమ్‌శర్మ

ఏసీపీ పూజలు

గ్రామంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పూజలకు ఏసీపీ భీమ్‌శర్మ హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

జనగామ రూరల్: ఇటీవల కాకతీయ యూనివర్సిటీ నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య సోమవారం తెలిపారు. 800 మీటర్ల పరుగుపందెంలో జి.ఉదయ్‌కుమార్ బంగారు పథకం సాధించగా, 1,500 మీటర్లలో రజత పతకం సాధించాడు.400 మీటర్ల పరుగుపందెంలో బన్నీ, కార్తిక్, రాము బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్, టి కళ్యాణి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో నర్సయ్య

సంక్షిప్త సమాచారం

తరాలను కలుపుతున్న నోములు



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జంగం రవి–సరళాదేవి దంపతులు దీపావళి నోములు నోచుకున్నారు. ఈ నోములకు 4 తరాలకు చెందిన 40 మంది కుటుంబ సభ్యులు ఒక్కచోట చేరారు. కార్యక్రమంలో హర్షిణి–విజయ్‌కుమార్, జంగం ప్రణీత, కుంట మల్లయ్య–ఎల్లమ్మ, మానస–శివ తదితరులు పాల్గొనగా అర్చకుడు చొల్లేటి రాజేశ్వరశర్మ వేద మంత్రాలతో కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

కమిటీల జోక్యం లేకుండా ఇళ్ల జాబితా ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: ఇందిరమ్మ కమిటీల జోక్యం లేకుండా ఇళ్ల జాబితా ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. సోమవారం అడవికేశ్వపూర్ సీపీఎం గ్రామ శాఖ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్లు నిర్మించాలని తహసీల్దార్‌కు హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల ద్వారా పేదలకు సరైన న్యాయం జరగదని అన్నారు. సీపీఎం గ్రామ శాఖ నాయకులు ఉత్కూరీ సారయ్య , నాంపల్లి బన్నీ, దండు ఎల్లయ్య ఉత్కం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

చిల్పూరు: నూతనంగా ఎన్నికైన బీఆర్‌ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌లు పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని గార్లగడ్డతండాకు చెందిన మాలోత్ రమేష్‌నాయక్‌ను పార్టీ మండల ఇన్‌చార్జిగా నియమించగా సోమవారం పార్టీ నాయకులతో కలిసి రాజయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న వారికి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్, ఉడుత వెంకన్న, మాచర్ల ప్రవీణ్, వడ్లూరి మమత వెంకటేష్, శ్రీధర్, నాగేందర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఎస్సైకి ఆహ్వానం

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నందున ఉత్సవాలకు హాజరు కావాలంటూ ఎస్సై సిరిపురం నవవీన్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. దీంతో పాటు ఉత్సవాలు ముగిసే వరకు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేపట్టాలని కోరారు. అలాగే చిల్పూరు ఆలయ ఈఓ మోహన్‌బాబు, అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, కుర్రెంల మోహన్‌లకు పత్రికను అందజేశారు.

హర్షం



పాలకుర్తి: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అర్బన్ రెసిడెన్షియల్ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు సోమవారం గూడూరు గ్రామంలో విద్యార్థులు.. ప్రిన్సిపాల్ రేణుకా రాథోడ్‌తో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశానికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఆసిక,మాధవి, కవిత, సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.